## క్లుప్తంగా

### ఎస్సీల సంక్షేమానికి రుణాలు అందించాలి



కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీల సమగ్రాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ కోరారు. కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను గురువారం చంగిచెర్లలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రుణాల గురించి చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు పురుషోత్తం, శంకర్ తదితరులు ఉన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం బొంగ్లూర్‌లో కొప్పుల మంజులకు రూ.30 వేలు, ఎరుకల చంద్రయ్యకు రూ.56 వేలు, సాకేత్‌రెడ్డికి రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, రామారావు, కృష్ణారెడ్డి, ప్రభాకర్ ఉన్నారు.

### ఆలయాల అభివృద్ధికి సహకరిస్తాం

కడ్తాల్: ఆలయాల అభివృద్ధికి సహకరిస్తామని, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరత్ నాయక్ అన్నారు. మండల పరిధి గానుగుమార్లతండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి గురువారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, రాధాకృష్ణ ట్రస్ట్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌లు 50 బస్తాల చొప్పున సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా దశరత్ మాట్లాడుతూ.. ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో మాజీ ఎంపీపీ సువాలీ పంతునాయక్, మాజీ ఎంపీటీసీ గోపాల్, రామకృష్ణ, పాండు, శంకర్, భీమన్, మహేశ్‌కుమార్, నవీన్, లక్ష్మణ్ ఉన్నారు.

### సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోండి

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి, సబ్సిడీ సిలిండర్ పథకాల కోసం అర్హులైనవారు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, గ్యాస్ సిలిండర్ కనెక్షన్ నంబర్, గృహవిద్యుత్ కనెక్షన్ నంబర్, ఫోన్ నంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 2న సింగంపల్లి, మాలెపల్లి, 3న చింతలపల్లి, మంగళపల్లి, 4న మేడిగడ్డ, శంకరకొండతండా, 5న రాంనుంతల, కోనాపూర్, 6న కొత్తకుంటతండా, పోలెపల్లి, శెట్టిపల్లి, 7న ఆకుతోటపల్లి, సీతారాంనగర్‌తండాల ప్రజలు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### మున్సిపల్ కమిషనర్ బదిలీ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ వసంత మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సచివాలయంలో పనిచేస్తున్న శంకర్‌నాయక్ బదిలీపై రానున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడినట్లు సమాచారం.

# డబుల్ బెడ్రూంలు రెడీ

- ఆదిబట్లలో రూ.9.54 కోట్లతో 8 బ్లాకులు
- ఐదేళ్లకు 90 శాతం పనులు పూర్తి
- తాగునీరు, విద్యుత్ సరఫరానే తరువాయి
- స్థానిక ఎన్నికలలోపు లబ్ధిదారులకు కేటాయించే అవకాశం



ఆదిబట్లలో పూర్తయిన డబుల్ బెడ్రూంలు ఇళ్లు

ఇబ్రహీంపట్నం రూరల్: డబుల్ బెడ్రూం నిర్మాణాలు పూర్తి కావచ్చాయి. 90 శాతం నిర్మాణ పనులు పూర్తికాగా.. మిగిలింది తాగునీరు, విద్యుత్ సరఫరా పనులే. ఐదేళ్లుగా పనుల్లో కదలిక లేకపోయినా.. ఏడాది కాలంగా నిర్మాణ పనుల్లో వేగం పుంజుకుంది. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీ పటేల్‌గూడ రెవెన్యూ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఐటీ పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, మరో మంత్రి హరీశ్‌రావు, నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. నాటి నుంచి కొనసాగుతున్నాయి.

**180 ప్లాట్లు**

ఎంపీపటేల్‌గూడ రెవెన్యూలో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో 180 మందికి ప్లాట్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. 2021లో గౌరిశంకర్ అనే సంస్థకు కాంట్రాక్టు దక్కింది. నిర్మాణ పనులకు రూ.9.54 కోట్ల నిధులను కేటాయించారు. చకచకా పనులు ప్రారంభించినా.. సబ్ కాంట్రాక్టర్‌కు ఇవ్వడంతో బిల్లులు రాలేదంటూ స్లాబు లెవల్లో పనులు ఆపేశారు. అప్పటి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, పనులు ప్రారంభించింది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ అధికారం చేపట్టడంతో పనులు వేగవంతం అయ్యాయి. ఇప్పటికి 90 శాతం పూర్తి అయ్యాయని అధికారులు తెలిపారు. రూ.9.54 కోట్ల నిధుల్లో సగం బిల్లులు మంజూరయ్యాయని, మిగతా రూ.4 కోట్లు రావాల్సి ఉంది.

**మౌలిక వసతులు కరువు**

నివాసానికి అనుగుణంగా వసతులు కల్పించాల్సి ఉంది. రన్నింగ్ వాటర్, తాగునీరు, విద్యుత్, సెప్టిక్ ట్యాంకులు ఏర్పాటు చేయాలి. కానీ నేటికీ వాటి జాడలేదు. 180 ప్లాట్లలో.. భవిష్యత్తులో 500 మంది అక్కడ నివాసం ఉండే అవకాశం ఉంది. దీని కోసం తప్పని సరిగా నీరు అవసరం. కానీ ఇక్కడ బోరు లేదు, తాగునీటి వసతి కల్పించలేదు. ఎనిమిది బ్లాకులకు సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం భారీగా చేపట్టాల్సి ఉంది. విద్యుత్ సౌకర్యానికి ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటన్నింటికి రూ.2 కోట్లు పైగా నిధులు కావాల్సి ఉండగా.. ఈ నిధులు కేటాయించినట్లు తెలుస్తోంది. ఇక పనులు చేపట్టడమే తరువాయి. ఇదిలా ఉండగా.. మిగతా పది శాతం పనులు పూర్తి చేయించి, వచ్చే నెలలో అప్పగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.

### ఇక్కడి వారికి ప్రాధాన్యత



ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలో నిర్మించిన ఇళ్ల కేటాయింపులో.. బొంగ్లూర్, ఆదిబట్ల, కొంగరకలాన్, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లి, రాందాస్‌పల్లి అర్హులకు తొలి ప్రాధాన్యత కల్పించేలా చూస్తాం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పక్షపాతం లేదు. అర్హులందరికీ లబ్ధిచేకూరుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, బొంగ్లూర్

### అర్హులందరికీ న్యాయం చేస్తాం



ఆదిబట్ల మున్సిపాలిటీలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు.. అర్హులందరికీ అందజేస్తాం. గత పాలకుల నిర్లక్ష్యం వలన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. ఏడాది కాలంగా పనులను పూర్తిచేయించాం. స్థానిక సంస్థల ఎన్నికల వరకు లబ్ధిదారులకు అందించే ప్రయత్నం చేస్తాం.

– గురునాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్

# గాంధీ సిద్ధాంతం అందరికీ ఆదర్శం

మహాత్ముడి వర్ధంతిలో వక్తలు



ఆమనగల్లులో.. మున్సిపల్ కమిషనర్ వసంత, నాయకులు

కడ్తాల్: జాతిపిత మహాత్మాగాంధీ అహింస సిద్ధాంతం ప్రపంచ దేశాలకు ఆదర్శమని, ఆయన జీవితం యువతకు ఆదర్శమని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ కోసం గాంధీ చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు లక్ష్మయ్య, జహంగీర్‌బాబా, యాదయ్య, బ్రహ్మాచారి, సత్యం, యాదయ్యగౌడ్ తదితరులు ఉన్నారు. మండల పరిధి మైసిగండి గ్రామంలో గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో జవహర్‌లాల్ హీరాసింగ్, శేఖర్‌గౌడ్, తులసీ రాంనాయక్, రాజు, సుధీర్, అమర్‌సింగ్, సాయికుమార్, రమేశ్ ఉన్నారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు: గాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీచౌక్ వద్ద ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. విడిగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళి అర్పించారు. ఇందులో డాక్టర్ శ్రీనివాస్, నర్సింహ, రమేశ్, పాండురంగయ్య, మున్సిపల్ కమిషనర్ వసంత, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.



కడ్తాల్: గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు




తుర్కయంజాల్: గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కమిషనర్ అమరేందర్‌రెడ్డి, సిబ్బంది

# సర్వే చేస్తాం.. కానీ ఎంపిక చేయం!



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సర్వే చేస్తామని, కానీ అర్హులు, అనర్హులను ఎంపిక చేయడంలో మినహాయింపు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. సెలవు దినాల్లో పని చేయించవద్దని పేర్కొన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ వెంకటమ్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండల, జిల్లా స్థాయి అధికారులను నాలుగైదు గ్రామాలకు ఒకరి చొప్పున నియమించి, ఆయా పథకాల అర్హుల ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. యూనియన్ ఆదేశాల మేరకు ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశామని కార్యదర్శులు రాజ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేశ్, శివకుమార్, శ్రీలత, రాధ, మమత తెలిపారు.

# మిగిలింది తొమ్మిది ఎంపీటీసీలు మాత్రమే..



ఎంపీటీసీల ముసాయిదాను విడుదల చేస్తున్న ఎంపీడీఓ సంధ్య తదితరులు

మొయినాబాద్‌రూరల్: మొయినాబాద్ మండలంలో 17 ఎంపీటీసీలకు గాను ఎనిమిది ఎంపీటీసీలు మున్సిపాలిటీలో పోగా.. మిగిలింది తొమ్మిది ఎంపీటీసీలు మాత్రమే మండల పరిషత్‌లో ఉన్నాయని, జిల్లా అధికారుల సూచనలతో తెలిపామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. గురువారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో సాయంత్రం ఎంపీటీసీలకు సంబంధించిన పంచాయతీ రాజ్ యాక్ట్ 2018 ప్రకారం మున్సిపాలిటీలో పోయిన గ్రామాలను వదిలిపెడితే తొమ్మిది ఎంపీటీసీలు కేవలం మొయినాబాద్ మండలానికి మిగిలాయని, ప్రభుత్వం ద్వారా ముసాయిదా విడుదలైందని వెల్లడించారు. ఎంపీటీసీల వివరాలను నోటీసు బోర్డులో ప్రకటించిన వారిలో ఎంపీడీఓతో పాటు ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# అనుకున్న లక్ష్యాన్ని పూర్తిచేశా

- ఆదరించిన డివిజన్ వాసులకు కృతజ్ఞతలు
- మాజీ కార్పొరేటర్ లిక్కి మమత

బడంగ్‌పేట్: తనకు ఇచ్చిన 5 ఏళ్ల కాలంలో అనుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే సాధించానన్న తృప్తి ఉందని, ఆదరించిన డివిజన్‌లోని పలు కాలనీ వాసులకు 22వ డివిజన్ మాజీ కార్పొరేటర్ లిక్కి మమత ధన్యవాదాలు తెలిపారు. గురువారం డివిజన్‌కు చెందిన శివనారాయణపురం కాలనీకి చెందిన మహిళలు మాజీ కార్పొరేటర్ లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా వరదలు వచ్చినప్పుడల్లా శివనారాయణపురం, సాయిప్రభు హోమ్స్, సాయిరాం కాలనీలు వరద ముంపునకు గురై ఆస్తినష్టంతో పాటు అనేక ప్రమాదాలు జరగగా.. తాను కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే నష్టపోయిన 333 కుటుంబాలకు ప్రతీ ఇంటికి పదివేల చొప్పున నష్టపరిహారం ఇప్పించానని తెలిపారు. వారందరి శాశ్వత పరిష్కారానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోత్సాహంతో ఎస్ఎన్‌డీపీ నాలా మంజూరి చేయించి సమారు రూ.10 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేయించామని పేర్కొన్నారు. రూ.7.39 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్‌లైన్లు, వీధి దీపాలతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రోజు విడిచి రోజు తాగునీరు వచ్చేలా చర్య లు తీసుకున్నాం. హైటెన్షన్ వైర్ల కింద ఉన్న ఇళ్లకు ప్రమాదాలు జరుగకుండా బంచ్ కేబుల్ వేయించామన్నారు. తనను గెలిపించి అండగా ఉన్నా అన్ని కాలనీవాసులకు, మహిళలకు, డివిజన్ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి సహకారం అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్, డిప్యూటీ మేయర్, సహచర కార్పొరేటర్లు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# అబద్ధాలతో అందలం ఎక్కిన కాంగ్రెస్

**మాటనిలుపుకోని ప్రభుత్వం**

- అటకెక్కిన 420 హామీలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- పాలకులకు జ్ఞానం ప్రసాదించాలంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రాలు



ఇబ్రహీంపట్నం: శేరిగూడలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మంచిరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం: అబద్ధాలతో అందలం ఎక్కిన కాంగ్రెస్ పార్టీకి.. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ పిలుపుమేరకు.. గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా శేరిగూడలోని మహాత్ముడి విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి నివాళులు అర్పించారు. ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అధికారం చేపట్టి 420 రోజులు అయినా.. వాటిని అమలు చేయని పాలకులకు జ్ఞానాన్ని ప్రసాదించు అంటూ.. గాంధీ విగ్రహానికి మంచిరెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మాయమాటలతో పాలకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు పూటకో మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. మండలానికి ఒక గ్రామాన్ని ఎంచుకుని రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గతేడాది సాగు సాయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**పట్నం.. అధ్వానం**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని మంచిరెడ్డి పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వివిధ పనులకు మంజూరైన నిధులను దారి మళ్లిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. ఇది సరైంది కాదని, అవసరమున్నచోట నిధుల కేటాయింపు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ చంద్రయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ భరత్‌కుమార్, ఎంపీటీసీల మండల ఫోరం మాజీ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

ఆమనగల్లు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ ఆరోపించారు. పార్టీ పిలుపుమేరకు పట్టణంలో గాంధీ చౌక్ వద్ద నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడుతూ.. అధికారం చేపట్టి 420 రోజులు అవుతున్నా.. హామీలు నెరవేర్చడం లేదని విమర్శించారు. పథకాలు అమలు చేసేలా పాలకులకు జ్ఞానం ప్రసాదించు అంటూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇందులో పార్టీ నాయకులు బాలకృష్ణ, సయ్యద్ ఖలీల్, రఘు, శ్రీనునాయక్, పంతునాయక్, వెంకటేశ్, గుత్తి బాలస్వామి, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లులో..

**తలకొండపల్లిలో..**

మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇచ్చిన హామీలను ఇచ్చి అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నాయకులు శంకర్, నర్సింహ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్‌యాదవ్, యాదయ్య, పాండుయాదవ్, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ రంగనాయకుల గుట్ట ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కొహెడ, జన చైతన్య వెంచర్, అలూరి వెంచర్, కోల్డ్ స్టోరేజి కోహెడ, రంగనాయకుల గుట్ట టెంపుల్, సైబర్ సిటీ, తొర్రూర్‌లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఎంపీటీసీ స్థానాలపై నోటిఫికేషన్ విడుదల

చేవెళ్ల: చేవెళ్ల మండలంలో గతంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. మున్సిపాలిటీ ఏర్పాటుతో మండలంలో ఉన్న జనాభా ప్రతిపాదికన 12 ఎంపీటీసీ స్థానాలకు తుగ్గుతున్నాయని, దీనికి సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామని ఎంపీడీఓ హిమబిందు తెలిపారు. గురువారం ఈ డ్రాఫ్ట్ నోటిపికేషన్ విడుదల చేసిన ఆమె దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. డ్రాఫ్ట్ నోటిఫికేషన్ 30న విడుదల చేశామని, వీటిపై 31న అభ్యంతరాల స్వీకరణ, ఫిబ్రవరి 1, 2లలో పరిశీలన, 3వ తేదీ ఫైనల్ జాబితాను ప్రకటించనున్నట్లు తెలిపారు.

# విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు షురూ



దేవతా మూర్తులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో గురువారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పూజారి మఠం శేఖరయ్య ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, లక్ష్మీపూజ, దీపారాధన, పుణ్యాహవాచనం, కలశస్థాపన, మంగళహారతి, హోమం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులు నారాయణగౌడ్, యాదయ్యగౌడ్, కోశాధికారి బాలకృష్ణగౌడ్, కార్యదర్శి నిరంజన్‌గౌడ్, నాయకులు వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, నాగయ్యగౌడ్, కుమార్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, నరేశ్గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

ఆమనగల్లు: పట్టణంలోని గాంధీచౌక్ వద్ద గురువారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వసంత, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్‌లు పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో వారు కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా చైర్మన్లు చంద్రశేఖర్, రమేశ్, కసిరెడ్డి రాంరెడ్డి, ప్రోగ్రాం వైస్ చైర్మన్ బాలకృష్ణ, చైర్మన్ రామ్మోహన్, పీఆర్‌ఓ పాషా, సభ్యులు మోహన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

# త్వరలో బస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే కాలె యాదయ్య



బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, స్థానిక నాయకులు

చేవెళ్ల: ప్రయాణికుల అవసరాలకు అనుకూలంగా చేవెళ్లలో బస్‌స్టేషన్ నిర్మాణం జరిగిందని, త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి నూతనంగా నిర్మించిన బస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా బస్‌స్టేషన్ ఆవరణ మొత్తం తిరిగి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల బస్‌స్టేషన్ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి రూ.6కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరు చేసిన హెచ్ఎండీఏకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పనులు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే బస్‌స్టేషన్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజల అవసరాలకు తగిన విధంగా ఉండేలా నూతన బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టామన్నారు. ముందు భాగంలో ఉన్న పాత బస్‌స్టేషన్‌ను తొలగిస్తే బాగుంటుందని అధికారులకు సూచిస్తే, దీనిపై వారు తమకు ఆదేశాలు లేవని చెప్పటంతో దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. త్వరలోనే ప్రారంభించేందుకు కృషి చేస్తామన్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ డి.వెంకట్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, జిల్లా పార్టీ నాయకుడు ఆగిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.